సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 18 । అక్టోబర్ । 2023


ధాన్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి
శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. IIలో


కేకే లైన్లో రైళ్ల గమ్యం కుదింపు
కేకే లైన్లో భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదించినట్టు వాల్తేర్ రైల్వే అధికారులు తెలిపారు. IIలో


అప్పన్న హుండీ లెక్కింపు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 20 రోజులకు రూ.10,29,970 ఆదాయం వచ్చింది. IIలో

న్యూస్‌రీల్

సాహసం.. సంతోషం
- పర్యాటకులకు అందుబాటులోకి రానున్న జిప్‌లైన్
- 19న ప్రారంభించనున్న కలెక్టర్


బొర్రా గుహల వద్ద గోస్తనీ నదిపై పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన జిప్‌లైన్

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను ఆనుకుని గోస్తనీ నదిపై పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిప్‌లైన్ పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. ఈనెల 19న కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు పర్యాటకశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.35 లక్షలతో జిప్‌లైన్ ఏర్పాటుచేశారు.

పరిపాలన వికేంద్రీకరణపై నేడు మోదమ్మకు పూజలు

సాక్షి, పాడేరు: రాష్ట్ర పరిపాలన వికేంద్రీకరణ జేఏసీ పిలుపు మేరకు ఉత్తరాంధ్రలోని దేవాలయాల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పాడేరులోని మోద కొండమ్మతల్లికి బుధవారం ఉదయాన్నే ప్రత్యేక పూజలు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ పాడేరు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. మోద కొండమ్మ ఆలయంలో ఉదయం 8.30గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పూజలు నిర్వహిస్తారని, నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ట్రికార్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ చైర్మన్, పాడేరు మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

సమస్యలు పరిష్కారానికి నిధులు


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు ఇస్తామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి హామీ ఇచ్చారు. అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు మంగళవారం ఎంపీ మాధవిని మంగళవారం క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతులు అందజేశారు. కొన్ని పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నందున నిధులు కేటాయించాలని వారు కోరారు. బొయితిలి సర్పంచ్ లసింగి మల్లన్న, సీనియర్ నాయకులు కొండపల్లి మత్స్యరాజు, పెదలబుడు మాజీ సర్పంచ్ సుమర్ల రఘునాథ్, పద్మపురానికి చెందిన అచ్చిబాబు,వార్డు సభ్యులు లక్ష్మణరావు, కామేష్, సత్యనారాయణ, భగవాన్, రమణబాబు, సూరిబాబు, అర్మియరాజు, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యసేవలు భేష్


రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి


గర్భిణికి స్కానింగ్ పరీక్షలు

డివిజన్ కేంద్రమైన రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని రకాల వైద్యసేవలతో పాటు మేజర్ శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ జరుగుతున్నాయి. వైద్యులు అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు.

- పూర్తిస్థాయిలో వైద్య నిపుణులు
- అందుబాటులో అన్ని రకాల శస్త్రచికిత్సలు
- పెరుగుతున్న రోగుల సంఖ్య
- ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చుతున్న వైద్యులు

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మన్యంలో గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. మరోపక్క రంపచోడవరంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒకప్పుడు అత్యవసర వైద్యం కోసం రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లేవారు. ఇప్పుడు రంపచోడవరంలోనే మేజర్ సర్జరీలు జరుగుతున్నాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో గతంలో అవుట్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఏజెన్సీలో గిరిజనులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలు కార్యరూపం దాల్చాయి.

పది వేల మందికి పైగా..

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రతినెలా పది వేల మందికి వైద్య సేవలు అందుతున్నాయి. రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి గతంలో కంటే వైద్య సేవలు కోసం ఎక్కువ మంది వస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఆస్పత్రిలో 4,359 మంది ఇన్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందారు. అలాగే ఐదు నెలల కాలంలో 457 మేజర్ సర్జరీలు, 79 వరకు మైనర్ సర్జరీలు చేశారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 58,848 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 15 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. వీరిలో ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ గైనకాలజిస్టు కావడంతో ఆ విభాగంలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

వైద్యసేవలు బాగున్నాయి


చక్కెర వ్యాధి కారణంగా కాలుకు గాయమైంది. ఆస్పత్రిలో చేరి 30 రోజులు అవుతోంది. మంచిగా వైద్య చేస్తున్నారు. ప్రతీ రోజు కాలికి డ్రసింగ్ చేస్తున్నారు. కాలి గాయం తగ్గుతుంది.
– కారం అప్పారావు, ధరమడుగుల

బాగా చూసుకుంటున్నారు


ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరాను. ఇక్కడ వైద్య సేవలు బాగా అందుతున్నాయి. లోతట్టు ప్రాంతం నుంచి వచ్చిన మమ్మల్ని వైద్యులు బాగా చూసుకుంటున్నారు. మంచి ఆహారం కూడా పెడుతున్నారు.
– కత్తుల రాములమ్మ, పందిరిమామిడి

పూర్తిస్థాయిలో సేవలు


రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాం. ఎటు వంటి సమస్యలు లేవు. అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం సమకూరుస్తోంది.
– లక్ష్మి, సూపరింటెండెంట్, రంపచోడవరం ఏరియా ఆస్పత్రి

సమయపాలన పాటించకుంటే చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- మూడు చోట్ల గ్రామసచివాలయ సిబ్బందికి జీతాలు నిలిపివేత
- ఎంపీడీవోలకు ఆదేశాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో నుంచి 22 మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఉపాధిహామీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, ఆధార్ సీడింగ్, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణాలు, మనబడి నాడు –నేడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండలం కిలగాడ, పెదబయలు మండలం పర్రెడ, జి.మాడుగుల మండలం సొలభం–1 గ్రామ సచివాలయాలను డీఎల్‌డీవో తనిఖీకి వెళ్లినప్పుడు సాయంత్రం ఐదుగంటలకు ముందే కార్యాలయాలకు తాళాలు వేసి ఉన్నాయన్నారు. సంబంధిత సచివాలయ సిబ్బందికి జీతాలు నిలుపుదల చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అటవీహక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులకు ఉపాధిపనులు కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధి పనులకల్పనలో మారేడుమిల్లి, జికె.వీధి, రంపచోడవరం, జి.మాడుగుల మండలాల్లో వెనుకబడి ఉన్నాయన్నారు. పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో 20వేల వరకు చెరువులు ఉన్నాయని పనులు పెద్ద ఎత్తున ఉపాధి పనులు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలని ఆదేశించారు. ఉపాధికూలీలకు ఆధార్ సీడింగ్ చేయాలన్నారు. మంజూరు చేసిన జనన ధ్రువీకరణపత్రాలను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణ పనులు బిల్లులు ఎక్కడా పెండింగ్ లేవని అన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. భవనాలు లేని పాఠశాలల వివరాలను ఈనెల 21వతేదీలోగా సమర్పిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. మనబడి నాడు–నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం అధికారి కొండలరావు, డివిజన్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్, డీఎల్‌డీవో శాంతలక్ష్మి , ఉపాధిహామీ ఏపీడీ జె.గిరిబాబు, డీబీటీ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన


జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అటవీప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నరేంద్రియన్

రాజవొమ్మంగి: ఐ.పోలవరం నుంచి కాకరపాడు వరకు దాదాపు 72 కిలోమీటర్ల మేర రూపుదిద్దుకుంటున్న జాతీయ రహదారి 516 ఈ నిర్మాణ పనులను మంగళవారం డీఎఫ్‌వో నరేంద్రియన్ పరిశీలించారు. ఈ రహదారి పొడవునా ఎనిమిది చోట్లఅటవీ భూమి రహదారిలో కలుస్తున్నందున ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే పరంగా రోడ్డు నిర్మాణం జరుగుతుందా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల వన్యప్రాణులకు ఏవైనా ఇబ్బందులు ఎదురవుతాయనే కోణంలో ఆయన పరిశీలన సాగింది. ఆర్అండ్‌బీ ఏఈ చక్రవర్తి, స్థానిక అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర ఆయన వెంటన ఉన్నారు.

కాఫీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కేంద్ర కాఫీ బోర్డు విస్తరణ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ రమేష్

చింతపల్లి: వృత్తి విద్యా కోర్సులను అభ్యసిస్తున్న కాఫీ కార్మికులకు చెందిన ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కేంద్ర కాఫీ బోర్డు విస్తరణ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ఏటా బోర్డు ఆధ్వర్యంలో ప్రోత్సాహక ఉపకార వేతనాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో మొదటి ఏడాది, ఇంటర్, డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, నర్సింగ్ అగ్రికల్చర్, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులన్నారు. డిగ్రీ విద్యార్థులకు రూ.3750, ఇంటర్, డిప్లొమా విద్యార్థులకు 2,250, ఇంజనీరింగ్ ,పీజీ విద్యార్థులు, ఫార్మసీ, నర్సింగ్, అగ్రికల్చర్ విద్యార్థులకు రూ.7500 చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఆధార్, బ్యాంక్ ఖాతా, ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30లోగా మినుములూరు, అరకువేలి, చింతపల్లి కాఫీ బోర్డు కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు,

20న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

పౌర సరఫరాల శాఖ మంత్రి రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వస్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

వ్యూపాయింట్ పనులు వేగవంతం


చెరువులవేనంలో వ్యూపాయింట్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో


కొత్తపల్లి జలపాతం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

చింతపల్లి రూరల్: పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి వచ్చేలా చెరువులవేనం వ్యూపాయింట్ పనులు పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఆయన చెరువుల వేనంలో వ్యూపాయింట్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అంతకుముందు తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు ఉన్నారు.

లోతుగెడ్డ పీహెచ్‌సీ సందర్శన : గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని లోతుగెడ్డ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్, యూడీసీని డిప్యూటేషన్‌పై పంపించాలని డీఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేశారు.

త్వరితగతిన ఆధునికీకరణ పనులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలో కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. జలపాతం ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. పర్యాటక సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పనులు త్వరతగతిన పూర్తి చేసి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డీవీఆర్‌ఎం రాజు, ఏఈ దేముడు తదితరులు ఉన్నారు.


కొత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష ఓపీ పుస్తకాలను రోగులకు అందిస్తున్న ఎస్టీకమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు


వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు


గంపరాయిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


కొంతిలిలో వైద్యశిబిరాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

అనంతగిరి: విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన ముందుగా కాశీపట్నం కొత్తమ్మతల్లిగుడి వద్ద ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం కొత్తూరు కేజీబీవీ పాఠశాలలోని జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజనులకు అందుతున్న వైద్యసేవలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం నిర్మూలన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలవద్దకే వైద్యసేవలు అందిస్తున్నారని, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటుగా వైద్యాధికారులు పోస్టులను భర్తీచేసి, గిరిజనులకు మరింత వైద్యసేవలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారికి పోస్టుమార్టం అనకాపల్లి జిల్లా చోడవరం పీహెచ్‌సీలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయనను ఎంపీపీ శెట్టి నీలవేణి కోరారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. టూరిజం కార్మికులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. టూరిజం పనిచేస్తున్న న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షుడు నరసింహా కోరారు. రాష్ట్ర కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, సర్పంచ్ సీతయ్య, ఎంపీటీసీ సన్యాసిరావు, ఉపసర్పంచ్ గాలి నరసింహమూర్తి, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, డీడీ కొండలరావు, తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో శ్రీహర్షిత్, వైద్యాధికారి జ్ఞానేశ్వరీ పాల్గొన్నారు.

పెదబయలు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువ చేశారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం మండలంలోని గంపరాయి డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 538 మంది వైద్యసేవలు పొందారు. వీరిలో 38 మంది రిఫర్ చేశారు. ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, ఎంపీడీవో విగ్గిన్స్, వైస్ ఎంపీపీ రాజుబాబు, వైద్య నిపుణులు సర్వేశ్వరరావు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.

హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాశాఖ అధికారి డా.జమాల్ బాషా కోరారు. మంగళవారం మండలంలోని కొంతిలిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగంతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలోనే ఉన్నత వైద్యసేవలు అందుతున్నాయన్నారు. శిబిరంలో 648 మందికి వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, వైద్యాధికారులు డా.గాయత్రి, శివమణి, ప్రశాంత్, సర్పంచ్‌లు రేగం రమేష్, సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలతో గిరిజనుల ఆరోగ్యానికి భరోసా ఏర్పడిందని, గ్రామాల్లోనే సూపర్ స్పెషాలిటి వైద్య సేవలు అందుతున్నాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గుత్తులపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరం నిర్వహించారు.దీనిని ఆమె ప్రారంభించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఆమె పరిశీలించారు. సర్పంచ్‌లు గొల్లోరి నీలకంఠం, సాగెని బాబురావు పడాల్, కిల్లో ఈశ్వరమ్మ, వంతాల రాంబాబు, పాంగి రాంబాబు, ఎంపీటీసీ దూసురు సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్(విశాఖ): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి మంగళవారం ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లడ్డూలతో పూజ నిర్వహించారు. ముందుగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. లడ్డూల దాతలు నగరానికి చెందిన ఎం.సురేష్, మాధవి దంపతులు, పట్టుచీరలు అందించిన లక్కీ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం ధైర్యలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారని, తులసి పూజ నిర్వహిస్తున్నట్లు ఈవో శిరీష తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, వెంకటరత్నం, ధనలత, అనురాధ, సతీష్, సుబ్రహ్మణ్యం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 20 రోజులకు కోటి 10 లక్షల 29వేల 970 రూపాయలు వచ్చినట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 5 గ్రాముల బంగారం, వెండి 7.050 కిలోలు వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే 33 యూఎస్‌ఏ డాలర్స్, 148 మలేషియా రింగ్స్, 55 ఆస్ట్రేలియా డాలర్స్, 105 సౌదీ అరేబియా రియాల్స్, 125 యూఏఈ దిర్హామ్స్ లభించినట్టు తెలిపారు.

ఐఎన్ఎస్ డేగాలో వసతి గృహం ప్రారంభం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: ఐఎన్ఎస్ డేగాలో ఆరు అంతస్తుల నావికుల వసతి గృహాన్ని మంగళవారం తూర్పు నావికా దళ చీఫ్ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ప్రారంభించారు. ఈ వసతి గృహంలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇండస్ట్రియల్ కిచెన్, డైనింగ్ హాల్, రిక్రియేషనల్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

టీ–20 మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నవంబర్ 23న భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్
- సాగరతీరంలో భారీ స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు
- అన్ని శాఖల సమన్వయంతో మ్యాచ్‌ను నిర్వహిస్తాం
- మ్యాచ్ నిర్వాహక కమిటీ సమీక్షలో విశాఖ కలెక్టర్ మల్లికార్జున



వివరాలు వెల్లడిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా నవంబర్ 23న జరిగే భారత్–ఆస్ట్రేలియా తొలి టీ–20 క్రికెట్ మ్యాచ్ జోష్ అప్పుడే మొదలైంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే భారీగా అభిమానులు తరలివస్తారు. వైఎస్సార్ ఏసీఏ, వీడీసీఏ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 27 వేలు. మరి టికెట్లు దొరకని వారి పరిస్థితి ఏంటి? అందుకే ఈ సారి ఐపీఎల్ తరహాలో సాగర తీరంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు క్రికెట్ సంఘం సన్నాహాలు చేస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో టికెట్లను పకడ్బందీగా విక్రయించాలని మ్యాచ్ నిర్వాహక కమిటీ నిర్ణయించింది.

స్టేడియంలో మంగళవారం మ్యాచ్ నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

పూర్తి సహకారం అందిస్తాం

ప్రపంచ క్రికెట్ కప్ పూర్తయిన తర్వాత భారత్, ఆస్ట్రేలియా జట్లు టీ–20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌ను విశాఖ వేదికగా ఆడనున్నాయి. ఇంకా నెల రోజులకు పైగానే సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించామని కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. మ్యాచ్ నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపై సమీక్ష చేసినట్లు చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ.. టికెట్ల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామన్నారు. మ్యాచ్ సజావుగా సాగేందుకు అధికార యంత్రాంగం బీసీసీఐ, ఏసీఏకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆటగాళ్ల కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని వివరించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ ఇరుజట్ల ఆటగాళ్ల భద్రతతో పాటు ప్రజలు, అభిమానుల బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రవేశానికి తగిన ఏర్పాట్లతో పాటు మ్యాచ్ పూర్తయిన వెంటనే ట్రాఫిక్ నియంత్రించేందుకు సమీక్ష చేశామన్నారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులకు అసౌకర్యం లేకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. టికెట్ల విక్రయ కౌంటర్ల వద్ద తగిన భద్రత కల్పిస్తామన్నారు.

అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఆహ్వానిస్తాం

మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లపై కమిటీ పూర్తిస్థాయిలో చర్చించిందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. స్టేడియంలోకి ఆహార పదార్థాలు, పారిశుధ్యం, మంచినీరు సరఫరా తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన క్రికెట్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను మ్యాచ్ చూసేందుకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఐపీఎల్ తరహాలో సాగరతీరంలో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయించిదని వివరించారు.

సీఎం జగన్‌తో గ్రామ స్వరాజ్యం సాధ్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కిముడుపల్లిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్ రెడ్డితో సాధ్యమైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలోని మారుమూల కిముడుపల్లి గ్రామ సచివాలయం భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయం ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి సారిగా కిముడుపల్లి గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఒక్క కిముడుపల్లి పంచాయతీకి నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మరో రూ.18 కోట్లతో కిముడుపల్లి పంచాయతీ కేంద్రం నుంచి పాడేరుకు, మండల కేంద్రానికి, అనుసంధానం చేస్తూ తారురోడ్లు నిర్మించామని చెప్పారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లేందుకు రెండు గంటల సమయం పడితే, నేడు రోడ్ల అనుసంధానంతో 20 నిమిషాల నుంచి అరగంటలోపే పాడేరు, పెదబయలుకు వెళ్ల వచ్చని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో హామీలతో సరిపెడితే నేడు అభివృద్ధి చేసి చూపించామని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకుని, మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ రామం, ఎంపీడీవో విగ్గిన్స్, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ శోభారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు, నాయకుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బందిపై ఆగ్రహం

కిముడుపల్లి గ్రామ సచివాలయం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొంత మంది గ్రామ సచివాలయం సిబ్బంది హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఛార్జ్ మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోకు సూచించారు. విధులు సరిగా నిర్వహించని ముగ్గురు వలంటీర్లను తొలగించాలన్నారు.

ఈపీసీ సభ్యుడిగా ఆచార్య పి.జె.రావు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ విభాగం విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ పి.జగన్నాథరావు ఎన్విరాన్‌మెంట్ అప్రైజల్ కమిటీ(ఈపీసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. భారత పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పు మంత్రిత్వ శాఖకు చెందిన ఇండస్ట్రీ–3 విభాగానికి ఈఏసీ సభ్యుడిగా ఆయన వ్యవహరిస్తారు. బల్క్ డ్రగ్ ఇండస్ట్రీ, ఫెర్టిలైజర్ ఇండస్ట్రీ, పెయింట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్గానిక్ కెమికల్స్ ఇండస్ట్రీ, డై మ్యానుఫ్యాక్చరింగ్ తదితర పరిశ్రమల స్థాపనలో అవసరమైన పర్యావరణ అనుమతులను ఈఏసీ పర్యవేక్షిస్తుంది. ఇటువంటి కీలక కమిటీ సభ్యుడిగా ఏయూ ఆచార్యుడు నియమితులు కావడంపై ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య పి.జె రావును అభినందించారు.

చేసిన అభివృద్ధి, చేకూరిన లబ్ధిని ప్రజలకు చెప్పండి

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పెదలోచలిలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గిరిజన ప్రాంతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతనాలున్నరేళ్లుగా చేసిన మేలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చెప్పాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో పెదలోచలి పంచాయతీ కేంద్రంలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి ఈ నాలుగున్నర ఏళ్లలో జరిగిన మేలు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల్లో ఇదివరకు ఎప్పుడూ జరగలేదని ఆమె అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతి ఒక్కరికీ వివరించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించేలా చేసే బాధ్యత తీసుకోవాలని ఆమె అన్నారు. ప్రతి హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందని ఆమె చెప్పారు. ప్రతి హామీని తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. జగన్ మాటస్తే శిలా శాసనం లాంటిదని, ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రం అలవోకగా అబద్ధాలు చెబుతారని ఆమె చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ గ్రామాలకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామాల్లో బస చేయాలని ఆమె సూచించారు. పార్టీ శ్రేణులందరూ కలసికట్టు పని చేస్తే 2024లో మరోసారి ఘన విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్‌లు చినకుమారి, కిముడు రాంబాబు, రామకృష్ణ, ఐసరం హనుమంతరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్.కళ్యాణం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదబాలన్న,గంగరాజు, వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు సూర్యప్రకాష్‌నాయుడు, కె.చంద్రపతి,ఉమా కళ్యాణం, శివ, రాజశేఖర్, తిరుపతిరావు, మత్స్యకొండబాబు, కాసులమ్మ, వరలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రవాణా సౌకర్యం

ఎంపీ మాధవి హామీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈవో, ఇతర అధికారులు

కొయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫేడరేషన్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు రవాణా సౌకర్యం కల్పిస్తామని అరకు ఎంపీ మాధవి హామీ ఇచ్చారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరుగుతాయని డీఈవో గౌరీ శంకర్ ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అండర్ 14 విభాగంలో వాలీబాల్, మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు రవాణా సదుపాయం కల్పించాలని వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ మాట్లాడుతూ క్రీడాకారులకు తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గిరిజనులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలన్నదే ధ్యేయమని చెప్పారు. క్రీడల నిర్వాహణ కార్యదర్శి పాంగి సూరిబాబు,నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె శివప్రసాద్ పాల్గొన్నారు.

'దసరా' ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ చార్జీలే..

- రానుపోనూ రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు సిద్ధం

దాబాగార్డెన్స్(విశాఖ): దసరా సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సిద్ధం చేసిన ప్రత్యేక సర్వీసులను సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు విజయనగరం జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం జోన్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ బస్సులు 5 కాగా.. 32 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. విజయవాడకు షెడ్యూల్ బస్సులు 26 కాగా, 110 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు వివరించారు. రానుపోను ముందుస్తుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని బస్ స్టేషన్లలో ప్రయాణికుల రద్దీకి సరిపడే బస్సులు నడిపేందుకు.. అధికారులకు స్పెషల్ డ్యూటీలు వేశామన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ బస్సులు ఆశ్రయించాల్సిన అవసరమే లేదని, ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. కావాల్సిన వారు డిపోల్లో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి వెళుతున్న ప్రైవేట్ బస్సు బోల్తా



బోల్తా పడిన బస్సు



కొత్తపోలవరంలో ఆందోళనలో గ్రామస్తులు

12మంది ఎస్.రాయవరం మండలవాసులకు గాయాలు

పెళ్లకూరు (తిరుపతి జిల్లా)/ఎస్.రాయవరం: తిరుపతి జిల్లా నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై పెళ్లకూరు వద్ద మంగళవారం వేకువజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన 12 మంది గాయపడ్డారు. వివరాలు.. ఎస్.రాయవరం మండలం గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామానికి చెందిన 23 మంది శ్రీవారి భక్తులు తిరుమలకు బస్సులో బయలుదేరారు. మార్గం మధ్యలో ముందు వెళుతున్న వాహనాన్ని బస్సు అధిగమించబోయి, ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది గాయపడగా వారిలో పల్లా వరహాలమ్మ, రమణమ్మ, అవ్వా రమణమ్మ, నాగమణిలకు తీవ్ర గాయాలయ్యాయి.

దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటిన తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా జోగు దండుకొని ఐదు రోజుల యాత్రకు బస్సు మాట్లాడుకొని సోమవారం మధ్యాహ్నం వారంతా కుటుంబాలతో బయలుదేరినట్టు కొత్తపోలవరం గ్రామస్తులు తెలిపారు.

కేకే లైన్లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఇటీవల వాల్తేర్ డివిజన్,కొత్తవలస–కిరండూల్(కేకే)లైన్, మనబార్–జరాటి స్టేషన్ పరిధిలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. దీని కారణంగా పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

పలు రైళ్ల గమ్యం కుదింపు...

భువనేశ్వర్‌లో బుధవారం బయల్దేరే భువనేశ్వర్–జగదల్‌పూర్ (18447)హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్–భువనేశ్వర్ (18448)ఎక్స్‌ప్రెస్‌గా బుధ,గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖలో బుధవారం బయల్దేరే విశాఖ– కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ(18513)ఎక్స్‌ప్రెస్‌గా బుధ,గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖలో బుధ,గురువారాల్లో బయల్దేరే విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్–విశాఖ (08552) పాసింజర్ స్పెషల్‌గా బుధ,గురువారాల్లో అరకు నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. హౌరాలో బుధవారం బయల్దేరే హౌరా - జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్ - హౌరా(18006) ఎక్స్‌ప్రెస్‌గా బుధ,గురువారాల్లో టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది. రూర్కెలాలో బుధవారం బయల్దేరే రూర్కెలా–జగదల్‌పూర్ (18107) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరవలసిన జగదల్‌పూర్ - రూర్కెల (18108)ఎక్స్‌ప్రెస్ బుధ,గురువారాల్లో కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన బైక్



గాయపడిన సన్యాసి

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా రోడ్డు మార్గంలో మంగళవారం ఇరువైపుల నుంచి రాకపోకలు సాగిస్తున్న రెండు బైక్‌లు ఎదురెదురుగా వస్తూ అదుపు తప్పి ఢీకొన్నాయి. కొర్రా పంచాయతీకి చెందిన సన్యాసి(45), పెదబయలు మండలం గంపరాయి గ్రామానికి చెందిన వ్యక్తి కొర్రా వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ఆటోలో అరకులోయ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

హార్బర్‌కు అదనపు హంగులు

- ఆధునికీకరణకు అదనపు నిధులు
- రూ.152 నుంచి రూ.178 కోట్లకు వ్యయం పెంపు
- ఈ సొమ్ముతో శాశ్వత జెట్టీ, ఆక్షన్ హాలు, వార్ఫ్‌ల నిర్మాణం
- మత్స్యకారుల అభ్యర్థనకు సానుకూల నిర్ణయం



విశాఖ ఫిషింగ్ హార్బర్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు మరిన్ని అదనపు హంగులు సమకూరనున్నాయి. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు కానున్నాయి. ఈ హార్బర్ ఆధునికీకరణకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.151.81 కోట్లను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటివరకు రూ.22.93 కోట్లను విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ చేపల రేవు ఆధునికీకరణలో భాగంగా తొలి దశలో రూ.37.26 కోట్లతో ప్యాకేజి యూనిట్/కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లను ఏర్పాటు చేస్తారు. ఫేజ్–2లో విద్యుత్ పనులు, ఫేజ్–3లో రెండు ఆక్షన్ హాళ్లు, రిటైనింగ్ వాల్, ఫేజ్–4లో ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫేజ్–5లో ఫ్లోటింగ్ జెట్టీ, ఫేజ్–6లో డ్రెడ్జింగ్ పనుల నిర్వహణ, ఫేజ్–7లో టైర్ ఫెండర్ల ఏర్పాటు వంటివి చేపడతారు. గత డిసెంబర్ నుంచి ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలో మత్స్యకారులు వివిధ అంశాలపై అభ్యంతరాలను లేవనెత్తడంతో కొన్నాళ్ల పనులకు అంతరాయం కలిగింది. మరో ఆక్షన్ హాలుతో పాటు ప్రస్తుతం ప్రతిపాదించిన ఫ్లోటింగ్ జెట్టీ స్థానంలో శాశ్వత జెట్టీ, వార్ఫ్‌లు. మూడో ఆక్షన్ హాలు నిర్మించాలని, బీచింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ ఎ.మల్లికార్జున వారితో పలు మార్లు సంప్రదింపులు జరిపి మత్స్యకారుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. వీటికి అదనంగా నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. దీంతో సవరించిన అంచనాల ప్రకారం ఆధునికీరణకు రూ.151.81 కోట్లకు బదులు రూ.178.51 కోట్ల అంచనాలను ప్రతిపాదించి ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి నివేదించినట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. దీనికి అక్కడ నుంచి ఆమోదం రాగానే వీటి పనులు ప్రారంభానికి అవసరమైన ప్రక్రియను మొదలు పెడతామని ఆమె తెలిపారు.

లక్ష్యం.. 2025 అక్టోబర్..

మరోవైపు మొత్తం ఏడు దశల పనులకు గాను ఇప్పటివరకు ఆరు ఫేజ్‌ల పనులకు వర్క్ ఆర్డర్లు జారీ చేశారు. ఇంతవరకు ఫేజ్–1, 2ల్లో 37 శాతం చొప్పున, ఫేజ్–4లో 8 శాతం, ఫేజ్–6లో 100 శాతం, ఫేజ్–7లో 21 శాతం చొప్పున పనులు పూర్తయ్యాయి. ఇలా సగటున 9.50 శాతం మేర పనులు జరిగాయి. తొలుత నిర్దేశించిన ప్రకారం ఈ హార్బర్ ఆధునికీకరణ పనులను ఈ ఏడాది నవంబరు నాటికే పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనులు కొన్నాళ్లు నిలిచిపోవడం, సవరించిన అంచనాలు, అదనపు పనులు చేపట్టనుండడంతో 2025 అక్టోబరు నాటి కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.